# బడాయి-బిచ్చాలికూర

వి.వి.యస్. రామదాసు



"అసలు నాకు గొప్పలుచెప్పుకొనడం అంటే బొత్తిగా కిట్టదు సుమండీ" అన్నది అష్టాక్షరమ్మ.

జానకమ్మకి కూడా గొప్పలు చెప్పుకొనడం యిష్టంలేదు. కాని అదే విషయాన్ని గొప్పగా చెప్పుకొనవలసిన అవసరం ఆమెకు కనిపించలేదు. ఈ గొప్పలు చెప్పుకొనేవాళ్ళను చాలమందిని చూసింది ఆమె. కొంతమంది మరీ వీధినిపడి. సిగ్గంతా కాశీలో విడిచినట్లు గొప్పలు చెప్పుకుంటారు. ఆ కోవకు అష్టాక్షరమ్మ చెందినట్లు జానకమ్మ గ్రహించింది. మరి కొంతమంది నాజూకుగా, కొద్దిగా, తక్కువ మాటలలో సూచన ప్రాయంగా, చాలవరకు తమ ప్రవర్తనద్వారా తమ గొప్పతనాన్ని ప్రకటించుకుంటారు. జానకమ్మ అద్దెకున్న యింటిగల ఆవిడ పిసరమ్మగారు యిలాంటితెగకు చెందినది. ఏ కోవకు చెందినవారినైనా యెంతసేపూ యితరుల బడాయిని వింటూ కూర్చోవాలంటే యెవరికైనా కష్టంగానే ఉంటుంది. కాని జానకమ్మకి వేరేమార్గంలేదు. ఇంటిగల

కథానిక :




ఆవిడతో మంచిగా ఉండకపోతే గడవదు.

అయితే అష్టాక్షరమ్మగారి మాటలను వింటూ కూర్చోవలసిన అవస్థ యెందుకు పట్టిందంటే, జానకమ్మ తన స్నేహితురాలైన సీతమ్మను పేరంటానికి పిలవటానికి పోగా, "మా యింటిగల ఆవిడను కూడా పేరంటానికి పిలుద్దూ, నీకు పుణ్యం ఉంటుంది. ఆవిడ పేరంటానికి వస్తుందా రాదా అనేది వేరేసంగతిగాని యీ యిళ్ళలో యెవరిని పేరంటానికి పిలచినా అష్టాక్షరమ్మగారిని పిలవలసినదే. లేకపోతే ఆవిడగారికి కోపం వస్తుంది" అని సీతమ్మ బ్రతిమాలడం వల్ల జానకమ్మ అష్టాక్షరమ్మగారిని పిలవడానికి వెళ్ళింది, అంతే.

ఇంటిగలవారి వాటాకి వెళ్ళి తలుపు తట్టింది జానకమ్మ. అష్టాక్షరమ్మ తలుపు తీస్తూ, "అదేంటమ్మా. డోర్‌కి బెల్ ఉన్నది. అది నొక్కలేకపోయారా. అనవసరంగా తలుపు తట్టడానికి శ్రమపడ్డారు" అన్నది.

"క్షమించండి, నేను చూడలేదు" అన్నది జానకమ్మ.

"అబ్బే, పరవాలేదులెండి. మీరు సీతమ్మగారి స్నేహితురాలు కదండీ?"

"అవునండి. ఎల్లుండి మా అబ్బాయి పుట్టినరోజు పండుగ చేసుకుంటున్నాము. పేరంటానికి తప్పకుండా రావాలమ్మా'' అని పిలిచింది.

"చాలా సంతోషమమ్మా. కూర్చోండి. కాస్త కాఫీతాగి పోదురు గాని. ఇప్పుడు మిల్కు దొరకదనుకో కండి. మేము యెవరినీ దేబిరించుకుని అడగక్కరలేదు. ఎప్పుడూ ఒక అర్ధ శేరు పాలు ఫ్లాస్కులో రెడీగాఉంటాయి. ఉండండి, సర్వెంటును పిలుస్తాను" అని కాలింగ్ బెల్ నొక్కింది అష్టాక్షరమ్మ. ఎవరూ రాలేదు.

"ఈ సర్వెంటుగాడికి యింకా సివిల్ జేషను ఒంటబట్టలేదు. అమెరికా వెళ్ళి వచ్చిన మా మూడో అల్లుడుగారు ఈ కాలింగ్ బెల్ పద్ధతిని మా యింట్లో ప్రవేశపెట్టారు. మా సర్వెంటు సన్నాసికి యింకా అలవాటు కాలేదుగాని ఎంత సుఖమండీ. గొంతుకు చించుకుని అరవనక్కరలేదు" అంటూ మరొకసారి కాలింగ్ బెల్ నొక్కింది అష్టాక్షరమ్మ. అయినా యెవరూ రాలేదు.

"సన్నాసీ ఎక్కడచచ్చావురా?'' అని అరుస్తూ లోపలికి వెళ్ళింది.

జానకమ్మ ఒకసారి గదిఅంతా పరిశీలించింది. గదిలో ఒకప్రక్కన ఒక టేబిలుమీద రేడియో ఉన్నది. మరొక ప్రక్కన ఒకమూలకు ఒక చిన్న టెబిలుమీద టెలిఫోను ఉన్నది. గది మధ్యగా ఒకదానికొకటి ఎదురుగా నాలుగు సోఫాలున్నాయి. వాటన్నిటికి అందుబాటులో ఒక టీపాయి ఉన్నది. నేలమీద తివాసీలుపరిచి ఉన్నాయి. గది గోడలనిండా చాలా ఫోటోలు తగిలించి ఉన్నాయి. వాటన్నిటిని చూస్తూంటే ఆ యింటివాళ్ళు కెమెరాకు ఎదురుగా తప్ప యే ముఖ్యమైన పనినీ చేసేవాళ్ళు కారేమోనని జానకమ్మకు అనిపించింది. అష్టాక్షరమ్మగారి దగ్గర యెవరైనా అద్దెకొంపకి వాయిదా అడుగుదామనుకున్నా, యేమైనా చేబదులు అడుగుదామనుకున్నా కొంచెం ఉపోద్ఘాతంగా ఫోటోలగురించి అడిగి, కొంచెంపొగిడి తరువాత తమకు కావలసిన కార్యం సాధించుకుని పోయేవారు. అయితే జానకమ్మకు అష్టాక్షరమ్మను పొగడవలసిన అవసరం ప్రస్తుతం యేమీ లేదు. ఫోటోలసంగతి యెత్తితే అష్టాక్షరమ్మ దస్తరం విప్పుతుంది. ఆవిడ చెప్పిందంతా వినడానికి జానకమ్మకు వ్యవధిగాని, ఓపికగాని లేదు. అందుచేత ఎందుకైనా మంచిది, ఆ ఫోటోల ప్రసక్తి తేకుండా ఉందామని నిశ్చయించుకున్నది. బల్లమీద రెండు బైండు పుస్తకాలున్నాయి. ఒకటి ఆల్బం మాదిరిగా ఉన్నది. మరొకటి పేపరు కటింగ్ ఫైలు.

టీపాయిమీద ఆంధ్రుల అభిమాన దినపత్రిక 'తెలుగు బాకా' ఉన్నది. ఆ పత్రిక జానకమ్మకు బాగా పరిచయమై

నదే. ఎందుచేతనంటే ఆమె స్నేహితురాలిమీద అభిమానంకొద్దీ ఆ పత్రిక కొంటున్నది.

"వంటా మెకు పురమాయించానమ్మా, కాఫీ పెట్టమని. దగ్గరుండి చెబితేగాని సరిగా అమరవుకదా" అంటూ అష్టాక్షరమ్మ వచ్చింది.

"మరేనండి, పిన్నిగారూ" అన్నది జానకమ్మ.

"మీ రెక్కడుంటున్నారండీ, మీ పేరేమిటన్నారు" అని జమిలిగా ప్రశ్నించింది అష్టాక్షరమ్మ.

"నా పేరు జానకమ్మ. నేను దిల్‌సుక్‌నగర్‌లో 'చిద్విలాసం క్వార్టర్సు'లో అద్దెకుంటున్నానండీ," అని చెప్పింది జానకమ్మ.

"ఏం గొప్పగా పేరుపెట్టారండి 'చిద్విలాసం క్వార్టర్సు' అని. పిసరమ్మగారి పిచ్చుకగూళ్ళు అని కాదండీ అందరూ అక్కడ చెప్పుకుంటారు?"

"కావచ్చు. కాని నేను చెప్పినపేరు ఆ యింటిమీద వ్రాసిఉన్నది, చెప్పాను. మరొకసంగతి. ఆవిడ అసలుపేరు పిసరమ్మకాదు" అన్నది జానకమ్మ.

"అసలుపేరు యేమిటో కాస్త చెప్పండి. మీ రావిడను యేమని పిలుస్తారు?"

"అసలుపేరు నాకుకూడా తెలియదు. నేను నాకంటె మరీ పెద్దవాళ్ళందరినీ పిలిచినట్లే పిన్నిగారూ అని పిలుస్తాను!"

"అసలు పేరు చెంగల్రావుపేట చాంతాడంత పొడుగుగా ఉంటుంది. అది వాళ్ళ నాయనగారికి సరిగా జ్ఞాపకం ఉండదు. చిన్నప్పటినుండీ ఆవిడను పిసరమ్మ అనే పిలిచేవారు. నా కెందుకంత బాగా తెలుసునని మీకు అనుమానం కలుగవచ్చు. మా కన్నవారి ఊరూ ఆవిడ పుట్టింటివారి ఊరూ ఒకటే. ఆ ప్రక్క ఊర్లోవాళ్ళ సంబంధమే చేశారు ఆవిడకి. కాని అక్కడ బ్రతుకుతెరువు లేక వాళ్ళాయన హైదరాబాదు వచ్చేశారు" అని అష్టాక్షరమ్మ చెబుతూ పోతూంది.

"అయితే మీ ఆయన యెందుకు హైదరాబాదు వచ్చారు?" అని అడ్డుప్రశ్న వేసింది జానకమ్మ.

"మా ఆయనేమీ కడుపు చేత్తో పట్టుకుని యీ వూరు రాలేదు. అసలు, ఆయన తాతముత్తాతలనుండి యీ సిటీలోనే ఉంటున్నారు. ఇంతకూ ఆయనకు ఉద్యోగంగాని వ్యాపారంగాని చేయవలసిన ఖర్మేం పట్టింది? సిటీలో మాకు ఉన్న ఇళ్ళ అద్దెలను వసూలుచేసుకుంటూ ఉంటే చాలు. ఒకరి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడవలసిన పనిలేదు..." అని అష్టాక్షరమ్మ యింకా యెంతసేపు మాట్లాడుతుందిరా భగవంతుడా అని జానకమ్మ భయపడుతూ ఉండగా నౌకరు సన్యాసి తలగోక్కుంటూ వచ్చాడు.

"ఏమిరా సన్నాసీ, కాఫీ తేలేదేం?" అని ప్రశ్నించింది అష్టాక్షరమ్మ.

''మరండి అమ్మగోరూ, పాలు యిరిగిపోయినయ్యటండి" అని నెమ్మదిగా చెప్పాడు సన్యాసి.

"పరవాలేదండి పిన్నిగారూ. కాఫీ త్రాగాననుకుంటాను. ఇక నేను వెళ్ళి వస్తానండి'' అని జానకమ్మ లేవబోతూ ఉంటే.

''మీరు ఉండండి జానకమ్మగారూ. మిల్కు విరిగిపోతేనేం. కాస్త బటర్ మిల్కు తీసుకుని వెళ్ళండి. ఒరే సన్నాసి. అమ్మగారికి మాంచి బటర్ మిల్కు పట్రా" అని పురమాయించింది అష్టాక్షరమ్మ.

"బట్రమిల్కు యెక్కడుంది. కావలస్తే కాస్త మజ్జిగో పెరుగో తెస్తానండి అమ్మగారూ."

"వీడితో చాలా న్యూసెన్సుగా ఉంది. పెద్దవాళ్ళతో పరిచయం మూలాన నాకు యింగ్లీషు ముక్కలు అలవాటైపాయె" అని జానకమ్మతో అని, సన్యాసి వైపు చూచి, "ఆమాత్రం యింగ్లీషు తెలియక పోతే యెలారా? బటర్ మిల్కు అంటే మజ్జిగరా. పోయి వెంటనే పట్రా'' అన్నది అష్టాక్షరమ్మ

"మంచిదండి'' అని సన్యాసి మజ్జిగ తేవడానికి వెళ్ళాడు.

"ఏమిటి చెబుతున్నానండి జానకమ్మగారూ?'' అని అడిగింది.

"అదేనండి, పిసరమ్మగారి సంగతి."

"అవును, పిసరమ్మగురించే చెబుతున్నాను. ఆవిడ యెంత గొప్పలు చెప్పుకుంటుందనుకున్నారు." అన్నది అష్టాక్షరమ్మ.

ఈ మాట యదార్థం అని జానకమ్మకు అనుభవపూర్వకంగా తెలుసును. అష్టాక్షరమ్మ మాదిరిగా కాకుండా తక్కువ మాటలతో చాలావరకు తన ప్రవర్తనతో పిసరమ్మగారు తన గొప్ప తనాన్ని చాటుతుంది. జానకమ్మ పేరంటానికి పిసరమ్మగారిని పిలవగా ఆవిడ, "నేను తప్పకుండా వస్తానుకోండి. కాని మిగతా ఊర్లోవాళ్ళను పిలవడానికి మన టెలిఫోను ఉపయోగించుకోండి. పరవాలేదు,'' అన్నది.

"మనకు టెలిఫోను ఉందిగాని నేను పిలవవలసిన వాళ్ళందరికీ టెలిఫోను ఉండాలికదా, పిన్నిగారూ" అని జానకమ్మ అనగా,

''పోనీలెండి. మా కారులో వెళ్ళి రండి జానకమ్మగారూ" అని పిసరమ్మగారు తన ఛారీతనాన్ని ప్రకటించుకుంది. అయితే ఆత్మాభిమానంగల జానకమ్మ, ''చాలా థాంక్స్, పిన్నిగారూ. కాని నేను వెళ్ళేవి యెక్కువ యిళ్ళు లేవు. ఉన్నవైనా బస్సుమీద వెళ్ళిరావడానికి అందుబాటులో ఉన్నాయి'' అని చెప్పి బస్సుమీదనే పేరంటానికి పిలవాలని బయలుదేరింది జానకమ్మ. ఇవ్వాళే




కాదు, చాలాసార్లు పిసరమ్మ తన గొప్ప తనాన్ని ప్రకటించుకుంది. ఆ విషయమే అష్టాక్షరమ్మగారు చెప్పారు.

“అసలు నాకు గొప్పలు చెప్పుకొనడం అంటే బొత్తిగా కిట్టదు సుమండీ” అన్నది అష్టాక్షరమ్మగారు.

సన్యాసి మళ్ళీ వట్టి చేతులతో వచ్చాడు.

“ఏమిటిరా బటర్ మిల్కు యేదీ?” అన్నది అష్టాక్షరమ్మ.

“మజ్జిగంతా పిల్లి తాగేసిందటండి, అమ్మగారూ” అన్నాడు సన్యాసి.

ఈసారికూడా వెళదామనుకుంది జానకమ్మ. కాని పిసరమ్మగారి గురించి యేమైనా చెబుతుందేమోనని కూర్చున్నది.

“మజ్జిగ లేకపోతే ఫ్రిజిడెరీలో నుంచి యేదయినా కూల్ డ్రింకు తీసి యివ్వమని వంటావిడతో చెప్పి పట్రా” అని పురమాయించింది, అష్టాక్షరమ్మ.

“అలాగేనండి అమ్మగారూ” అని సన్యాసి లోపలికి వెళ్ళాడు.

“అన్నట్టు యేమిచెబుతున్నాను. పిసరమ్మగారి బడాయిలు గురించికదూ?” అన్నది అష్టాక్షరమ్మ.

“అవునండి, పిన్నిగారూ.“

“ఒకనాడు యేమి జరిగిందో తెలుసునా? మా కుక్కపిల్ల ‘లూసీ’ లేదూ, మా పడక గదిలో పడుకున్నది. దాని పుట్టినరోజు పండుగ మేము చేసుకుంటూ, ఆ సందర్భంలో పిసరమ్మను పేరంటానికి రమ్మని ఫోనులో చెప్పాను. ఇంటికి

వెళ్ళి పిలవలేదని రాదనుకున్నాను గాని వచ్చింది."

"అక్కడే ఉన్నది ఆమెగారి గొప్ప తనం," అన్నది జానకమ్మ.

"నాకు తెలియదాయేమిటి, యెందుకు వచ్చిందో. తన గొప్పలు చెప్పి నన్ను ఔరుకొడదామని వచ్చింది. ఆ సంగతి నేను మొదటే పసికట్టాను. ఆవిడ పేరంటాళ్ళు అందరూ వెళ్ళిపోయేవరకూ కూర్చుంది. ఆవిడ యెంత బొత్తిగా మేనర్సు లేకుండా మాట్లాడుతుందో చూడండి, ఒక ఉదాహరణ చెబుతాను. నేను ఒక పేరంటాలుతో మాటవరుసకు అన్నాను, ఉన్నమాటే సుమా నేను అన్నది, గొప్పలు చెప్పుకోవాలని ఉద్దేశ్యంతో కాదు. మా అళ్ళుళ్ళు ముగ్గురూ విదేశాలకు వెళ్ళివచ్చిన వారేనని. ఆవిడ తపీమని మరొక పేరంటాలితో యేమిటన్నదో తెలుసునా?"

"ఏమిటన్నదండీ?'' అని అడిగింది జానకమ్మ.

" 'మొన్న మా ఆయన యేదో పుస్తకంకోసమని అమెరికాలో కంపెనీకి వ్రాసిన ఉత్తరం, ఎడ్రసు సరిగాలేదని తిరిగి వచ్చేసింది' అన్నది. పేరంటాళ్ళందరూ గొల్లుమనినవ్వారు. 'వాళ్ళాయనకు ఎడ్రసైనా సరిగా వ్రాయడం తెలియదన్నమాట' అని నేను చురక అంటించే సరికి పేరంటాళ్ళంతా మళ్ళీ గొల్లుమని నవ్వారు. ఇంతకి చెప్పొచ్చే దేమిటంటే, ఆవిడ నామీద యెందుకోగాని విషప్రచారము చేస్తూనే ఉంది."

"ఏమని ప్రచారం చేశారండి, పిన్నిగారూ?" అన్నది జానకమ్మ ఉత్సాహంగా.

"నాపేరు ఎంతో పవిత్రంగా మా నాయన ఓంకారయ్యగారు పెట్టుకుంటే, ఆవిడ యేమిటి ప్రచారం చేస్తున్నదో తెలుసునా?"

"ఏమిటండి?"

" 'ఎవరి కొంపకూల్చనా' అనే అష్టాక్షరాలను మా నాయన జపించేవాడనీ, అందుచేతనే అష్టాక్షరమ్మ అని పేరు పెట్టుకున్నాడనీ అందరితోనూ చెబుతున్నదట."

"అలా ప్రచారంచేస్తూ ఉంటే మీరు ఊరుకున్నారా?"

"నే నెందుకూరుకుంటానూ? ఆవిడ పేరు ముద్దుగా పిసరమ్మ అని వాళ్ళ నాన్నగారు పిలుచుకుంటూ ఉంటే ఆవిడ గారి పిసరంతబుద్ధికి చిహ్నంగా ఆ పేరు పెట్టారని నేను ప్రచారం చేస్తున్నాను."

"మంచిపని చేస్తున్నారు, పిన్నిగారూ," అన్నది జానకమ్మ.

"ఇలాగే అందరూ మెచ్చుకున్నారు. ఇంతకూ ఆ రోజున జరిగిన సంగతి చెప్పనేలేదు."

"చెప్పండి, పిన్నిగారూ."

"పిసరమ్మగారు తన గొప్పలు చెప్పుకోవాలని పేరంటాళ్ళు అందరూ వెళ్ళి




పోయేవరకూ కాచుకుని కూచున్నది. 'మా అమ్మాయి యీ మధ్య రవీంద్ర భారతిలో నాట్యం చేసింది మీరు చూశారా, అక్కగారూ' అంటూ మొదలుపెట్టింది. ఇంక ఊరుకుంటే లాభంలేదు, ఎంత సేపు ఆ విషయంమీద బోరుకొడుతుందో నని నే నప్పుడు యేమి చేశానో తెలుసునా ?"

"ఏమిచేశారండి, పిన్నిగారూ?" అని అడిగింది జానకమ్మ ఉత్సాహంగా.

"ఆ బల్లమీద పేపరు కటింగ్సు ఫైలు తీసి చూపించాను. అందులో ఆంధ్రుల అభిమాన దినపత్రిక అయిన 'తెలుగుబాకా' మా గురించి ప్రచురించిన వార్తలు, ఫొటోలతో సహా ప్రచురించి నవి పేపరుకటింగ్సు ఫైలుచేసి ఉంచారు మావారు. ఆ ఫైలులో మా మనుమరాలు, మా మహిళాసమాజంలో చేసిన నాట్యం గురించి ప్రశంసిస్తూ, ఉన్నమాటే సుమండీ, వ్రాసిన పేపరు కటింగు చూపించే సరికి పిసరమ్మగారి మొగము పిసరంతయి ప్రసంగం మార్చేసింది."

"అప్పటికైనా బుద్ధివచ్చి యింటికి పోలేదా, పిన్నిగారూ ?"

"సిగ్గన్నది ఉంటేకదా, బుద్ధిరావ డానికి. తరువాత, 'మా అబ్బాయి క్రికెట్టులో అంతర్విశ్వవిద్యాలయాల పోటీ లలో డబుల్ సెంచరీచేశాడు' అని మొదలుపెట్టింది. చచ్చాంరా, భగవం తుడా అనుకుని వెంటనే పేపరుకటింగ్ ఫైలుతీసి మా రెండో అల్లుడు ఇంగ్లం డులో యేయే ఆటలు చూడడానికి వెళ్ళాడో అక్కడ ఆటలు యెలా ఉంటాయో వివరిస్తూ తాను ఇంగ్లండు

వెళ్ళి వచ్చినప్పటికీ తెలుగు భాషమీద అభిమానం ఉన్నవాడు కాబట్టి తెలుగు లోనే ఒక వ్యాసం వ్రాసి తెలుగుబాకా పత్రికవారు కోరగా వారికి యిచ్చారు వారు ప్రచురించిన ఆ వ్యాసం చూపించే సరికి పిసరమ్మగారు 'యిక వస్తానమ్మా' అని లేవబోయారు ఆవిడకు యింకా శాస్తి చేయాలన్న ఉద్దేశ్యంతో యేమి చేశానో తెలుసునండీ ?"

"ఏం చేశారు, పిన్నిగారూ ?"

"మా ఆయన అడపా తడపా అక్కడక్కడ యిచ్చిన బహిరంగో పన్యాసాలనూ, నేనుకూడా ఉడతా భక్తిగా మా మహిళా సమాజంలో యిచ్చిన ఉపన్యాసాలను ప్రత్యేకంగా 'తెలుగు బాకా' విలేఖరి వచ్చి వ్రాసుకున్నవి ఆ పత్రికలో ప్రచురించిన భాగాలనూ, యింకా మేము చేసిన యెన్నో ఘన కార్యాలను గురించి 'తెలుగు బాకా' లో ప్రచురించబడిన పేపరు కటింగులన్నీ ఆమెగారికి చదివి వినిపించడం మొదలు పెట్టాను ఆవిడ అంతా విని విని చివరికి వెళ్ళిపోతూ ఏమిటన్నదో తెలుసునా ?"

"ఏమిటన్నదండీ, పిన్నిగారూ ?"

'ఎంత బొత్తిగా మర్యాద తెలియనిదో చూడండి 'ఇక వస్తానమ్మా' అన్నట్టు అక్కయ్యగారూ, 'తెలుగు బాకా' పత్రికలో సబ్ ఎడిటరుగా పని చేస్తున్న ఫలానా ఆయన మీ యింటిలో అద్దెకుంటున్నారు కదండీ ?' అని అడిగేసి వెళ్ళిపోయిందండీ ఎంత యింట్లో అద్దెకున్న వాళ్ళయినా ఉన్న యదార్థాలూ, గొప్ప విషయాలూ, ప్రజలందరూ తెలుసుకోవలసినవి వ్రాయడంలో తప్పేముంది, మీరే చెప్పండి, జానకమ్మగారూ '

"ఏమీ తప్పు లేదండి ఆవిడకు మర్యాద తెలియదు కాబట్టి అలాంటి ప్రశ్న వేసింది ఇక నేను వెళ్ళానండి!" అని జానకమ్మ లేవబోయింది

"ఉండమ్మా కూల్ డ్రింకు తాగి పోదురుగాని అన్నట్టు ఈ సర్వెంటు సన్నాసి యింకా రాడేం చెప్మా" అంటూ కాలింగ్ బెల్ నొక్కింది ఎవరూ రాలేదు, 'సన్నాసి'అని గట్టిగాపిలిచేసరికి, "ఏందండమ్మగోరూ" అంటూ సన్నాసి వచ్చాడు

"కూల్ డ్రింక్ యేదిరా, సన్నాసి ?'

"మరేమో, అమ్మగారూ అందులో డింకు సీసాలన్నీ ఖాళీ అయిపోనాయండీ "

"మరి ఆ యిన్ఫర్మేషన్ నాకు వెంటనే యెందుకు చెప్పలేదురా ? జరిగినదేదో జరిగిపోయింది వెంటనే డ్రయివరుతో చెప్పి డ్రింకు తెప్పించు"అని పురమాయించింది, అష్టాక్షరమ్మ

"ఎందుకండి పిన్నిగారూ, మరొకసారి వచ్చినప్పుడు మీరు యేది యిస్తే అది తీసుకుంటాను లెండి " అని చెప్పి జానకమ్మ వీధిలోకి వచ్చేసింది

---